క్లుప్తంగా

వైభవంగా స్వామివార్ల కల్యాణం

పర్చూరు (చినగంజాం): పర్చూరు, ఉప్పుటూరు, నాగులపాలెం గ్రామ పొలిమేరలో వేంచేసి ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి వార్ల కల్యాణ మహోత్సవం శనివారం అంగరంగవైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ నిర్వహించారు. ఈమహోత్సవంలో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. నాగేంద్ర స్వామి పుట్టలో పాలు పోసి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

చీరాల: మండలంలోని మండల సమాఖ్య కార్యాలయంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. వెలుగు డీఆర్‌డీఏ ఏపీఎం కె.మధుసూదనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, ఎంపీడీఓ పి.శివసుబ్రహ్మణ్యం హాజరయ్యారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు, సీసీలు, వీఓ, ఓబి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీతలకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న అతిథులు

చీరాల అర్బన్: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పవని భానుచంద్రమూర్తి, గోనెళ్ల శేషవరలక్ష్మిలను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చేలా ఉత్తమ ప్రతిభను కనబరిచారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఎన్జీఓ హోమ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, ఏపీటీయూసీ ప్రధాన కార్యదర్శి బి.శామ్యూల్, స్థానిక ఎస్టీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు



నగదు పారితోషకాలు అందజేస్తున్న బ్యాంక్ మేనేజర్ ఉదయ్ కిరణ్

మార్టూరు: అత్యధిక హాజరుతో పాటు మెరుగైన పరీక్షా ఫలితాలు సాధిస్తున్న బాలికలను మండలంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ శాఖలు నగదు పారితోషకాలు అందించింది. శనివారం ద్రోణాదుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది 7, 8, 9 తరగతుల్లో పరీక్షలలో మెరుగైన ఫలితాలను సాధించడంతోపాటు అత్యధిక హాజరు శాతం కలిగిన బండారు సుమ, పల్లె పోగు సుమతి, నూతలపాటి అల్విత్త లకు పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున నగదు మేనేజర్ ఉదయ్ కిరణ్ అందజేశారు. కార్యక్రమంలో పెంటేల సత్యానారాయణ, బ్యాంకు ఆఫీసర్లు రాజేశ్వరి, అనిల్, పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశానంలో నరకం..!



అంబడి పూడిలో చిల్లచెట్లలో శ్మశాన వాటిక



ముక్తేశ్వరంలో చిల్లచెట్లలో శ్మశాన వాటిక

- చిల్లచెట్లలో శ్మశాన వాటికలు
- రహదారి వసతి లేక అవస్థలు
- శవం మోసుకెళ్లాలంటే నరకమే
- పట్టించుకోని పాలకులు, అధికారులు

బల్లికురవ: మనిషి జీవితాంతం ప్రశాంతంగా ఉండేది శ్మశానంలోనే అంటారు పెద్దలు. అలాంటిది మనిషి చనిపోతే కూడా బాధలు వదిలేటట్లు లేవు. పుట్టిన ప్రతి మనిషి చనిపోక తప్పదు. మరణించిన వారి అంతిమ సంస్కారాలకు ఆరడుగుల స్థలం అవసరం. అలాంటి స్థలాలైన శ్మశాన వాటికలు సరైన మౌలిక వసతులు లేక అడవులను తలపిస్తున్నాయి. చనిపోయిన వారిని ఖననం చేయాలంటే బతికున్న కుటుంబ సభ్యులకు ఎన్నో కష్టాలు ఎదురవతున్నాయి. 2017–18లో ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో శ్మశాన వాటికల అభివృద్ధికి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించింది. మండలంలో 21 గ్రామ పంచాయతీలకు ఈ నిధులు మంజూరయ్యాయి. కొణిదెన పంచాయతీకి మంజూరైన నిధులకు తోడు గ్రామ పంచాయతీ నిధులను జోడించి స్వర్గపురిని సర్పంచ్ కే లేపాక్షి



బురదమయ ఉన్న ముక్తేశ్వరం శ్మశాన వాటికకు వెళ్లే రహదారి

విష్ణు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బల్లికురవ, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాడులో శ్మశనా వాటిక పనులు చేపట్టలేదు.

చిల్లచెట్లలో శ్మశాన వాటికలు..

ఈ పరిస్థితులు ఇలా ఉంటే నిర్మాణ పనులు జరిగిన ముక్తేశ్వరం, పెదఅంబడిపూడి, వైదన పంచాయతీల్లో చిల్ల చెట్లు దట్టంగా పెరగటంతో అంత్యక్రియలు ముగించే పరిస్థితి లేదు. హిందూ, ముస్లిం, క్రిస్టియన్, శ్మశాన వాటికల్లో చెట్లు పెరగటంతో పాటు వసతులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. ముక్తేశ్వరం పంచాయతీలోని సూరేపల్లి గ్రామంలో సుమారు 1500 మంది జనాభా నివసిస్తున్నారు. గతంలో పాత సూరేపల్లిలో శ్మశాన వాటిక ఉండేది. అక్కడ గ్రామం లోతట్టుగా ఉండటంతో నాలుగు దశాబ్దాల క్రితం కొండకు దిగువ భాగానికి చేరి గృహాలు నిర్మించుకున్నారు. పాత గ్రామంలోని శ్మశాన వాటిక ఆక్రమణల్లో ఉంది. శ్మశాన వాటిక లేక అటవీ భూముల్లో అంత్యక్రియలు ముగిస్తున్నారు. మా భూముల్లోకి రావద్దంటూ ఇటీవల కాలంలో అటవీశాఖ అధికారులు కంప వేయించారు.

సరైన దారులు లేక..

ముక్తేశ్వరం గ్రామం నుంచి శ్మశాన వాటికకు వెళ్లే రహదారి బురదమయంగా మారింది. ఈ దారిలో శవాన్ని కుటుంబ సభ్యులు మోసుకొని వెళ్లాలంటే వారికి నరకం కనుపడుతోంది. కూకట్లపల్లి, గంగపాలెం, వేమవరం, కొత్త మల్లయ్యపాలెం, పాత మల్లయ్యపాలెం, సోమవరపాడు గ్రామాల్లో రహదారులు సక్రమంగా లేవు. హిందు, ముస్లిం, క్రైస్తవ, శ్మశాన వాటికలను ఆక్రమణల చెరనుంచి విముక్తి చేసి మౌలిక వసతులు కల్పించాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రహదారి వసతితో అభివృద్ధి పరచాలి..



ముక్తేశ్వరం గ్రామం నుంచి శ్మశాన వాటికకు వెళ్లే రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలి. చిల్లచెట్లు మౌలిక వసతులు కల్పించి ఇబ్బందులు తొలగించాలి. ఇందుకు అధికారులు, పాలకులు త్వరితగతిన పట్టించుకోవాలని కోరుతున్నాం.

– జీ కోటేశ్వరరావు, ముక్తేశ్వరం

అంబడిపూడి శ్మశాన వాటికను అభివృద్ధి చేయాలి..



చిన అంబడిపూడి, పెద అంబడిపూ డిగ్రామాలకు కలిపి ఏర్పాటు చేసిన శ్మశాన వాటిక నూతన భవనాన్ని చిల్లచెట్లు పూర్తిగా కమ్మివేశాయి. లోపలకు వెళ్లే పరిస్థితి లేదు. వర్షంలో సైతం దహనానికి వినియోగించే ప్లాట్‌ఫామ్ వినియోగించుకోలేకపోతున్నాం.

– బొమ్మినేని సాయి, పెద అంబడిపూడి

రోడ్లా.. బురద గుంతలా!

- పొలాలను తలపిస్తున్న చల్లారెడ్డిపాలెం పంచాయతీ అంతర్గత రోడ్లు
- పదేళ్లుగా కాలనీ వాసుల అవస్థలు
- దోమలకు ఆవాస కేంద్రాలుగా మారిన వైనం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు, పాలకులు



1వ వీధిలో రోడ్డులో నిలిచిన నీరు



3వ వీధిలో రోడ్డుపై ఇలా..



6వ వీధిలో..

వేటపాలెం: గ్రామాలతోనే దేశాభివృద్ధి సాధ్యమని మనందరికీ తెలుసు. రోజురోజుకూ పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో పల్లెల ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. అలాంటి గ్రామాలను రక్షించుకోవాలంటే మనమందరం నడుం బిగించాల్సిందే. ఉన్న పరిస్థితులకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టి ఆరోగ్యంగా ఉండేందుకు ప్రయత్నించాలి. కాని పాలకులు, ప్రభుత్వ అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని వివేకనందా కాలనీలో అంతర్గత రోడ్లలో వర్షం నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. వర్షం కురిసిందంటే చాలు దాదాపు నెల రోజుల పాటు నీరు నిల్వ ఉంటోంది. దీంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 10 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వంలో చీరాల మున్సిపాలిటీకి సంబంధించి అర్బన్ హౌసింగ్ స్కీమ్‌లో దాదాపు వెయ్యి మందికి వివేకానంద కాలనీలో గృహాలు నిర్మించారు. కాలనీలో విద్యుత్ లైన్లు మంచినీటి సరఫరా సౌకర్యం కల్పించారు. కానీ అంతర్గత రోడ్ల నిర్మాణం మాత్రం మరిచారు. వర్షం కురిస్తే చాలు రోడ్లపై వర్షం నీరు నిలబడి బురదమయంగా మారిపోతున్నాయి. ఈరోడ్డులో కాలనీ వాసులు నడవాలంటే కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. కాలనీలో నివాసం ఉండే ప్రజలు ద్విచక్రవానంపై వెళ్లాలన్నా కష్టంగా మారిందని కాలనీ వాసులు వాపోతున్నారు. ఒక్కోసారి వాహనాలు జారిపడి గాయాలపాలవుతున్నామని చెప్తున్నారు.

దోమలకు ఆవాస కేంద్రాలుగా..

రోడ్డుపై నిలిచిఉన్న వర్షం నీరు రోజుల తరబడి నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీనితో పాటు నిల్వ ఉన్న నీటిలో దోమలకు ఆవాస కేంద్రాలుగా మరాయి. ఈనీటిలో ఉత్పత్తి అయిన దోమల బెడతో కాలనీలనీ వాసులు రాత్రి, పగలు దోమలతో అవస్థలు పడుతున్నారు. దోమలు కుట్టడం వల్ల ఎటువంటి రోగాల బారిన పడతామోనని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు కాలనీలోని అంతర్గత రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

నిధులు కొరతతో మరమ్మతు చేయలేదు : రామోహన్‌రావు, చల్లారెడ్డిపాలెం

నేను ఇటీవలే బదిలీపై చల్లారెడ్డిపాలెం పంచాయతీ కార్యదర్శిగా వచ్చాను. అయితే పంచాయతీ విస్తీర్ణం చాల పెద్దది. అన్ని రోడ్డు వేయడానికి సరిపడా నిధులు లేవు. నిధులు సమీకరించుకొన్న తరువాత వరుస క్రమంలో రోడ్ల మరమ్మతులు చేస్తాం.

ఉచిత న్యాయసేవలతో ఉపయోగం



టోల్ ఫ్రీ నెంబర్ ఫ్లెక్సీ ఆవిష్కరించి మాట్లాడుతున్న న్యాయమూర్తులు

చీరాల రూరల్: ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవల కమిటీ ఆధ్వర్యంలో అందించే ఉచిత న్యాయ సేవలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కం సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు భవన సుముదాయంలో ఉచిత న్యాయ సేవలకు సంభందించిన టోల్ ఫ్రీ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను న్యాయమూర్తులు ఎం. సుధ, షేక్ రెహాన, షేక్ నిషాద్‌నాజ్‌లు న్యాయవాదులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ దేశంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరూ ఉచిత న్యాయ సేవలు పొందాలన్నదే ఉన్నత న్యాయస్థానాల లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి పోలీసు స్టేషన్‌లో ఈ టోల్ ఫ్రీ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీని కక్షిదారులకు అందుబాటులో ఉంచుతున్నట్లు చెప్పారు. టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 15100 కక్షిదారులు గుర్తుంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, న్యాయవాదులు ఎ. వెంకటేశ్వర్లు, టి. సురేష్, బాల సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి పాల్గొన్నారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ



ట్రై సైకిళ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

చినగంజాం: మండల పరిధిలోని 11 మంది దివ్యాంగులకు ఉచితంగా ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను పర్చూరు శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావు శనివారం అందజేశారు. దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా వెలుగు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అందజేశారు. దీంతో పాటు మండలంలోని 22 దివ్యాంగుల స్వయం సహాయక గ్రూపులకు రూ.30 లక్షలు నగదు రుణం రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్బారావు, సర్పంచ్ రాయని ఆత్మారావు, జనసేన నాయకుడు పీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుతో కూటమి మోసం



కరెంట్ చార్జిల పెంపుపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అద్దంకి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జిలను తగ్గించాలని సీపీఎం అద్దంకి మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం రాత్రి సీపీఎం ఆధ్వర్యంలో అద్దంకిలోని బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వ్యాపార సంస్థలకు, ప్రభుత్వ ఆఫీసులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను విద్యుత్ అధికారులు బిగిస్తున్నారని వాటిని వ్యతిరేకించి తొలగించాలన్నారు. కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి ప్రతినెల రీచార్జి చేసుకునే విధానం అమల్లోకి వస్తుందని దీని ద్వారా ప్రజలపైన వేల కోట్ల భారం పడుతుందని మండిపడ్డారు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీలతో అదనంగా వసూలు చేస్తున్నారరని, స్మార్ట్ మీటర్ అమలులోకి వస్తే మరింత ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులు ఆర్ కోటేశ్వరరావు, తోట వెంకటేశ్వర్లు, డీ. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్ బహూకరణ



హైస్కూల్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న దాతలు

ఇంకొల్లు (చినగంజాం): విద్యాలయాలు దేవాలయాలని.. బాగా చదువుకొని ఉన్నత స్థాయిలో నిలవాలని మానవతా స్వచ్చంద సేవా సంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా తల్లిదండ్రుల–ఉపాధ్యాయులు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు ఇంటి దగ్గర పిల్లల ప్రవర్తన పట్ల శ్రద్ధ వహించాలన్నారు. అప్పుడే వారి నడవడిక బాగుంటుందని, చదువులో కూడా చక్కగా రాణిస్తారని అన్నారు. ఇడుపులపాడు గ్రామానికి చెందిన అంబటి బాబూరావు ఆర్థిక సహకారంతో ల్యాప్‌టాప్‌ను పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ భూపతి, వైస్ చైర్మన్ లావణ్య, ఎల్‌ఎంహెచ్ కరస్పాండెంట్ నాగరాజకుమారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

104 సిబ్బందికి జీతాలు చెల్లించాలని వినతి

చినగంజాం: 104 సిబ్బందికి గడచిన నాలుగు నెలలుగా జీతాలు అందడం లేదని సమస్యను ప్రభుత్వం సత్వరం పరిష్కరించాలని కోరుతూ సిబ్బంది శనివారం పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు వాహన డీఈఓ పాదిలి రాఘవ వినతి పత్రం అందజేశారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలి, ప్రైవేట్ సంస్థ ద్వారా కాకుండా ప్రభుత్వమే నేరుగా జీతాలు ఇవ్వాలని, పీఎఫ్,ఈఎస్‌ఐ యాజమాన్య వాటా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాహన ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్‌లు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం కూడా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో డ్రైవర్ డీ విజయ్ పాల్గొని అందజేశారు.

తూతూ మంత్రంగా పేరెంట్స్, టీచర్స్ మీట్



పెదగంజాం ఉన్నత పాఠశాలలో భోజనం చేస్తున్న తల్లులు



మేదరమెట్లలో అరకొరగా హాజరైన తల్లిదండ్రులు

- సమావేశాలను టీడీపీ కార్యకర్తలతో నింపిన పార్టీ శ్రేణులు

చినగంజాం: ఒక నిర్దిష్ట లక్ష్యం లేకుండా ఏర్పాటు చేసిన పేరెంట్స్,టీచర్స్ సమావేశాలు తూతూ మంత్రంగా సాగాయి. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మేం ఏదో చేసేస్తున్నాం అంటూ కలరింగ్ ఇచ్చుకునేందుకు ఈసమావేశాలు ఏర్పాటు చేసినట్లుంది. గత ప్రభుత్వంలో విద్యకు అందలం ఎక్కిస్తే ఈ ప్రభుత్వంలో అధఃపాతాలానికి నెట్టింది.

విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం పేరుతో సమావేశం ఏర్పాటు చేసి వారితో సంబంధ బాంధవ్యాలను కొనసాగించేలా చూడాలని ప్రభుత్వం వేసిన ఎత్తుగడ కార్యరూపం వచ్చేటప్పటికీ ఫెయిలయింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన ఆరు నెలలు పూర్తయినప్పటికీ పాఠశాలలో ఎటువంటి పురోగతి లేక పోగా ఈ పాటికే ఏదో సాధించిన విధంగా తల్లిదండ్రులతో పాఠశాలల్లో ఉత్సవాలు నిర్వహించుకోవడం చోద్యంగా ఉందని పలువురు మండిపడుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు బిజీగా ఉండటంతో తల్లిదండ్రులు 30 శాతంకు మించి సమావేశాలకు హాజరు కాకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని ముందుగానే గమనించిన కూటమి పార్టీల నాయకులు తమ ప్రజా ప్రతినిధులు ప్రతి కార్యక్రమానికి భారీగా కార్యకర్తలను వివిధ కారణాలతో పాఠశాలల్లో జరిగే కార్యక్రమానికి భారీగా తరలించారు. పలుగ్రామాలలో సమావేశాలకు హాజరయిన పలువురు తల్లిదండ్రులు అక్కడ అంతటి ముఖ్యమైన ఏమీ లేదంటూ తిరిగి ఇళ్లకు వెళ్లిపోవడం కన్పించింది.

గత ప్రభుత్వమే నయమంటున్న తల్లిదండ్రులు

గతప్రభుత్వం నాడు నేడు పేరుతో పాఠశాల భవనాలు, సీబీఎస్ఈ సిలబస్, ఆధునిక సౌకర్యాలతో మరుగుదొడ్లు, శుద్ధ జల తాగునీటి సౌకర్యాలు కల్పన, విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన పేరుతో మల్టీ లాంగ్వేజ్ పాఠ్యపుస్తకాలు, నాణ్యమైన నోట్ పుస్తకాలు, బ్యాగులు, షూస్, టై,బెల్టు, నాణ్యమైన యూనిఫాం, తరగతులలో గ్రీన్ బోర్డులు, టచ్ స్క్రీన్ టీవీలు, విద్యార్థులకు బల్లలు తదితర సౌకర్యాల కల్పనతో పాటు అమ్మఒడి వంటి పథకాలను ప్రవేశ పెట్టి విద్యావ్యవస్థను ఉన్నత స్థాయికి తీసుకెళ్లింది, గత ప్రభుత్వం చేపట్టిన పథకాలకు కనీసం నామమాత్రంగా కూడా చేపట్టని కూటమి ప్రభుత్వం పెద్ద ఆర్భాటమే చేపట్టిందని తల్లిదండ్రులు పెదవి విరుస్తున్నారు.

విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

చినగంజాం: దేశ భవిష్యత్ పాఠశాల గదుల్లోనే రూపుదిద్దుకుంటుందని దేశాభివృద్ధి కృషి చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పర్చూరు శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావు అన్నారు. చినగంజాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి పాఠశాల హెచ్‌ఎం డీ రత్నకుమారి అధ్యక్షత వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పాఠశాలలే వేదికలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి టగ్ ఆఫ్ వార్ ఆడారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సౌజన్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నామమాత్రంగా నిర్వహించి మమ అనిపించారు. కొరిశపాడు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశాలకు పిల్లల తల్లిదండ్రులు అరకొరగానే హాజరయ్యారు. మేదరమెట్ల జెడ్పీ హైస్కూల్ లో నిర్వహించిన సమావేశంలో తల్లిదండ్రులకు పలు రకాల ఆటల పోటీలను తల్లులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందచేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవోలు పున్నయ్య, వీరరాఘవయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సుబ్రహ్మణ్యేశ్వర షష్టి



కారంచేడులో సుబ్రహ్మణ్యేశ్వర షష్టిలో పాల్గొన్న దంపతులు

కారంచేడు: మండల కేంద్రం కారంచేడు నాగేంద్రస్వామివారి పుట్ట వద్ద శనివారం సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్టి వేడుకలను కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల సహకారంతో అర్చకులు కారంచేటి వీరాంజనేయశర్మ సారథ్యంలోని అనేక మంది వేద పండితులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున దంపతులు స్వామివారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. వేద పండితులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

పేదల హృదయాల్లో నిలిచిన నరసింహారావు



నరసింహారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

యద్దనపూడి: రాజకీయాల్లో మానవీయ విలువలే ప్రజాస్వామ్య విలువలుగా భావించిన మహోన్నతమైన వ్యక్తి గొట్టిపాటి నరసింహారావు అని పలువురు వక్తలు కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే గొట్టిపాటి నరసింహారావు 11వ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన స్వగ్రామం యద్దనపూడిలో ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉన్న గొట్టిపాటి నరసింహారావు కాంస్య విగ్రహానికి ఆయన కుమారుడు గొట్టిపాటి భరత్, కుమార్తె లక్ష్మి, నరసింహారావు భార్య పద్మావతిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సమీపంలో ఉన్న మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతురావు విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఫర్నీచర్ అందజేత

చీరాల అర్బన్: మండలంలోని తోటవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో మౌలిక సౌకర్యాల కల్పనలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామ్‌ప్రసాద్ పిలుపుతో చీరాల ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ పూర్వ విద్యార్థులు, దాతల సహకారంతో శనివారం పాఠశాలకు ఫర్నీచర్‌ను అందించారు. చీరాల ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ 1982 బ్యాచ్‌కి చెందిన పలువురు పూర్వ విద్యారుల్థల్లో ఒకరైన బెంగళూరుకు చెందిన సంబూరి సీతారామయ్య అమెరికాలోని కూతురు, అల్లుడు పేరిట రూ.30 వేలు విలువ చేసే ఫర్నీచర్‌ను పాఠశాలకు అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మాదాల శివప్రసాద్, మాణిక్యరావు, సత్యనారాయణ, సంకే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

చీరాల డివిజన్

90101 55593 (చీరాల)

Office mail : sakshiongads@gmail.com